సోలార్ ప్యానెల్స్‌కు చెల్లు!

- జపాన్‌లో 'పెరోవ్‌స్కైట్' ప్యానల్స్ అందుబాటులోకి..
- ఏకబిగిన 30 ఏండ్లపాటు లైటింగ్.. ధర కూడా తక్కువ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): పర్యావరణానికి హాని చేయకుండా కరెంటును ఉత్పత్తి చేసేవిగా పేరొందిన సోలార్ ప్యానెల్స్ భవిష్యత్తులో ఇకపై కనిపించకపోవచ్చు. జపాన్‌లో ఇప్పటికే వీటి వాడకాన్ని తగ్గించేశారు. సంప్రదాయ సోలార్ ప్యానెల్స్ స్థానంలో పెరోవ్‌స్కైట్ అనే కొత్త ప్యానెల్స్‌ను తీసుకొచ్చారు. తక్కువ ధరలో ఎక్కువ కరెంటు ఉత్పాదకతే లక్ష్యంగా వీటిని తీసుకొచ్చినట్టు పరిశోధకులు చెప్తున్నారు.

ఏమిటీ 'పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్'?

సోలార్ ప్యానెల్స్ సాధారణంగా సిలికాన్ మెటీరియల్‌తో తయారు చేస్తారు. అయితే పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్‌ను కాల్షియమ్ టైటానేట్ అనే మెటీరియల్‌తో తయారు చేస్తారు. ఇదీ సెమీకండక్టర్. వెలుతురిని గ్రహించి దాని తీవ్రతను రెట్టింపు చేయడమే కాదు ప్రత్యేక కెపాసిటర్లలో ఎక్కువకాలం స్టోర్ చేసుకొనే సదుపాయమూ దీంట్లో ఉన్నది. 30 ఏండ్లపాటు ఏకబిగిన కరెంటును ఉత్పత్తి చేసే ఈ పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్ ధర.. సంప్రదాయ సోలార్ ప్యానెల్స్ కంటే ఎంతో తక్కువ.

'సోలార్ ప్యానెల్స్' కంటే ఎలా మెరుగు??

రెండు గదుల ఇంట్లో ఉండే ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, నాలుగు ఫ్యాన్లు, ఐదు బల్బులకు విద్యుత్తును సరఫరా చేయాలంటే 2కిలోవాట్ సోలార్ ప్యానెల్ అవసరం. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని కలుపుకొన్నప్పటికీ దీని కొనుగోలుకు రూ. 60 వేలు ఖర్చు చేయాలి. సూర్యకాంతి ఉన్నప్పుడే ఇవి పని చేస్తాయి. స్టోరేజీ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. వీటిని అమర్చడానికి ప్రత్యేకంగా ఇంటి పైకప్పు అవసరం. రాళ్లవాన, పిడుగులు పడినప్పుడు నాశనమయ్యే ప్రమాదం ఉన్నది. అయితే, పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్‌లో ఈ సమస్యలు లేవు. వీటి ధర చాలా తక్కువ. ఎనర్జీ స్టోరేజీ ప్రాబ్లమ్స్ లేవు. ఇంటి పైకప్పు మీదనే అమర్చాల్సిన అవసరం లేదు. వెలుతురు పడే ఎక్కడైనా బిగించవచ్చు. కాల్షియమ్ టైటానేట్‌తో తయారైన ప్రత్యేక ఫిల్మ్ ఎంతో ధృడమైనది. రాళ్లవానవంటివి ఈ ప్యానెల్స్‌ను నాశనం చేయలేవని పరిశోధకుల అభిప్రాయం. రష్యాలోని కొన్ని నగరాల్లోనూ ఈ తరహా ప్యానెల్స్ వినియోగం పెరిగినట్టు నిపుణులు చెప్తున్నారు.



అట్టారి సరిహద్దువద్ద రైతుల ట్రాక్టర్ ర్యాలీ

అన్నదాతల ట్రాక్టర్ మార్చ్

పంజాబ్, హర్యానాలో కదం తొక్కిన రైతులు

అమృత్‌సర్, హోషియాపూర్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో రైతులు ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతోపాటు తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కేంద్రాన్ని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా తదితర రైతు సంఘాలు ఈ మార్చ్‌ను నిర్వహించాయి. అమృత్‌సర్‌లో జాతీయ జెండాలను అలంకరించిన 600 ట్రాక్టర్లతో రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైతు నాయకుడు సర్వణ్ సింగ్ పంధేర్ నేతృత్వంలో 30 కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ సాగింది. తమ డిమాండ్లు నెరవేరే వరకు శంభు, ఖన్నూరి వద్ద తమ నిరసనలను కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. ఢిల్లీ చలో మార్చ్ జరిగి 200 రోజులు పూర్తయ్యే సందర్భంగా ఈ నెల 31న శంభు, ఖన్నూరి సరిహద్దుల్లో మహా పంచాయత్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

నేడే ఎస్ఎస్ఎల్వీ డీ3 ప్రయోగం

శ్రీహరికోట, ఆగస్టు 15: చిన్న చిన్న శాటిలైట్లను అభివృద్ధి చేయటం, అందుకు అనుకూలమైన పేలోడ్ పరికరాలను రూపొందించే లక్ష్యంలో భాగంగా ఇస్రో చేపట్టిన 'ఎస్ఎస్ఎల్వీ-డీ3' మిషన్ రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. శుక్రవారం శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఉదయం 9.19 గంటలకు ప్రయోగిస్తున్న రాకెట్ కౌంట్‌డౌన్ మొదలైంది. 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ఈవోఎస్-08ను తక్కువ ఎత్తులోని భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఈ మిషన్ లక్ష్యం. దాదాపు 6 నెలల తర్వాత ఇస్రో చేపడుతున్న రాకెట్ ప్రయోగమిది. కేవలం రెండు రోజుల ప్రణాళికతో చిన్న చిన్న శాటిలైట్స్‌ను తక్కువ ఖర్చుతో భూ కక్ష్యలోకి చేర్చేందుకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్‌తో సాధ్యమవుతుందని ఇస్రో మాజీ సైంటిస్టు ఒకరు చెప్పారు.

12 రోజులు డిజిటల్ అరెస్ట్

ఐఐటీ ప్రొఫెసర్‌కు 12 లక్షలు టోకరా

జైపూర్: మనీ లాండరింగ్ కేసు పేరుతో ఐఐటీ జోధ్‌పూర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను(35) మోసగించిన సైబర్ నేరగాళ్లు ఆమెను 12 రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ చేసి సుమారు రూ.12 లక్షలను దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలి పేరుతో ముంబైకు డ్రగ్స్‌తో కూడిన పార్సిల్ వచ్చిందని.. అందులో చాలా పాస్‌పోర్ట్‌లు, క్రెడిట్ కార్డులు ఉన్నాయని బెదిరించిన నేరగాళ్లు ఆమెను తమ పర్యవేక్షణలో ఉండాలని.. లేదంటే అరెస్ట్ చేయక తప్పదని బెదిరించి ఈ మోసానికి పాల్పడ్డారు. బాధితురాలికి ఈ నెల 1న వేర్వేరు ఫోన్ నెంబర్ల నుంచి ఈ బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో భయపడిన బాధితురాలు వారు చెప్పినట్టు చేస్తూ వచ్చారు. నేరగాళ్లు ఆమె ఫోన్‌లో కెమెరాను ఆన్‌లో ఉంచి ఆమెను నిరంతరం పర్యవేక్షించారు. ఫోన్ స్క్రీన్ షేర్ చేయించుకొని ఆమె ఫోన్‌ను నియంత్రణలోకి తీసుకొన్నారు. స్కైప్ యాప్ ద్వారా ఆమె ల్యాప్‌ట్యాప్‌నూ నియంత్రించారు. దీంతో ఆమె ఎవరినీ సంప్రదించలేకపోయారు. పది రోజుల తర్వాత ఆమె బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకొన్న నేరగాళ్లు మంగళవారం సుమారు రూ.12 లక్షలను చెక్ ద్వారా ఆర్టీజీఎస్ విధానంలో బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత బాధితురాలి ఫోన్, ల్యాప్‌ట్యాప్‌పై తమ యాక్సెస్ తొలిగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

వారానికో రోజు ఆఫీసుకొస్తే..

ఇలాగే వెనుకబడతాం

ఏఐ రేసుపై గూగుల్ ఇకనైనా దృష్టిసారించాలి: మాజీ సీఈవో ఎరిక్

న్యూఢిల్లీ, ఆగస్టు 15: అంతర్జాతీయ ఐటీ దిగ్గజం గూగుల్‌లో 'వర్క్ ఫ్రం హోం' విధానాన్ని కొనసాగించడంపై ఆ సంస్థ మాజీ సీఈవో ఎరిక్ స్మిత్ విమర్శలు గుప్పించారు. ఓపెన్ ఏఐ లాంటి స్టార్టప్‌లతో పోలిస్తే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రేసులో గూగుల్ చాలా వెనుకబడిపోయిందని, 'వర్క్ ఫ్రం హోం' విధానం, ఉద్యోగులు వారానికి ఒక రోజు మాత్రమే ఆఫీసుకు రావడమే ఇందుకు ముఖ్య కారణమని పేర్కొన్నారు. ఇటీవల స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగిన ఓ చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితాన్ని సమతూకంగా ఉంచాలని గూగుల్ నిర్ణయించిందని, ఉద్యోగులు గెలవడం కంటే త్వరగా ఇంటికి వెళ్లడం, ఇంటి నుంచి పనిచేయడం చాలా ముఖ్యమైపోయిందని అన్నారు. ఈ మార్పు గూగుల్‌కు ప్రతికూలంగా మారిందని, మిగతా టెక్ కంపెనీల్లో ఉద్యోగులు గంటల తరబడి గొడ్డుచాకిరీ చేస్తూ కొత్త ఆవిష్కరణలతో గూగుల్‌కు పోటీ ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. ఏఐ రేసులో వెనుకబడటంపై గూగుల్ ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరమున్నదని స్పష్టం చేశారు.

సామాజిక మాధ్యమాలపై దావా

ప్రజలను వ్యసనపరులుగా మారుస్తున్నాయని ఆరోపణ

టొరంటో: ప్రస్తుతం సమాజంలో చాలా మంది సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారిపోతున్నారు.కెనడాలోని మాంట్రియల్‌కు చెందిన ఒక యువకుడు వీటిపై చర్య కోరుతూ న్యాయస్థానంలో దావా వేశాడు. టిక్ టాక్, యూట్యూబ్, రెడ్డిట్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లపై తీవ్ర ఆరోపణలు చేశాడు. వ్యసనపరులుగా మార్చడమే కాక, వాటి కారణంగా పౌరుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతున్నదని ఆరోపించాడు. 2015 నుంచి తాను సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నానని, వీటి వల్ల ఉత్పాదకత, శరీరంలో పలు సమస్యలు ఏర్పడ్డాయని ఆరోపించాడు.

3 లక్షలమంది డాటా గల్లంతు

గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ యూజర్లకు హ్యాకర్ల దెబ్బ

న్యూఢిల్లీ: ప్రముఖ సెర్చ్ ఇంజిన్ గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ యూజర్లను హ్యాకర్లు టార్గెట్ చేసుకున్నారని, ఫేక్ బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్లతో యూజర్ల కంప్యూటర్లలో మాల్‌వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పరిశోధకులు తాజాగా హెచ్చరించారు. ప్రమాదకర ఎక్స్‌టెన్షన్లను డౌన్‌లోడ్ చేసుకోవటం ద్వారా దాదాపు 3లక్షలకు పైగా గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ యూజర్ల కంప్యూటర్లు ప్రభావితమయ్యాయని సైబర్ సెక్యూరిటీ కంపెనీ 'రీజన్‌ల్యాబ్స్' తాజా నివేదిక పేర్కొన్నది. దీంతో యూజర్ల వ్యక్తిగత డాటా, ఆర్థిక సమాచారం, పాస్‌వర్డ్‌లు హ్యాకర్ల చేతికి చిక్కాయని నివేదిక తెలిపింది. ప్రమాదకర ఎక్స్‌టెన్షన్లతో హ్యాకర్లు మరిన్ని దాడులు జరపవచ్చునని హెచ్చరించింది.

హామీలు అమలు చేస్తున్నాం

- సంక్షేమంలో మహిళలకు పెద్దపీట
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు

మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

కరీంనగర్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అభయ హస్తం హామీల్లో ఒక్కొక్కటీ అమలు చేస్తున్నామని, సంక్షేమంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్‌లోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రసంగించారు. కరీంనగర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఆయన మాటల్లోనే.. 'ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. జిల్లాలో ₹72.68 కోట్ల ప్రయోజనం పొందారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య పరిమితిని ₹5 లక్షల నుంచి ₹10 లక్షలకు పెంచాం. జిల్లాలో 12,969 మందికి చికిత్స అందించాం. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 687 సాధారణ, 1,595 శస్త్ర చికిత్సల ద్వారా కాన్పులు చేయించాం. నాణ్యమైన వైద్య పరీక్షలు, శానిటేషన్, అడ్మినిస్ట్రేషన్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్‌లో 95 శాతం పాయింట్లు సాధించి హుజూరాబాద్ ఏరియా దవాఖాన జాతీయ స్థాయిలో 3వ స్థానంలో నిలవడం గర్వకారణం. ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఈ ఏడాదిలో 4.50 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంట గ్యాస్ ఇస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 1,47,084 మందికి 2,79,243 సిలిండర్లు పంపిణీ చేసి ₹8.64 కోట్ల సబ్సిడీని అందించాం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వినియోగదారులకు ఉచిత సరఫరా చేస్తున్నాం. ఇప్పటి వరకు 1,39,329 ఉచిత బిల్లులు జారీ చేశాం. దీని ద్వారా 1,57,348 కుటుంబాలకు ₹32.23 కోట్ల సబ్సిడీ అందించాం. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం. దీని ద్వారా ఇప్పటి వరకు 58,317 మంది రైతు కుటుంబాలకు ₹383.89 కోట్లు ప్రయోజం కలిగింది. రాష్ట్రంలో వ్యవసాయ కమిషన్ ఏర్పాటు దిశగా ఆలోచనలు చేస్తున్నాం. రైతు బంధు కింద గత యాసంగిలో 1,90,826 మందికి ₹177.61 కోట్లు ఇచ్చాం. రైతు బీమా కింద 465 మందికి ₹5 లక్షల చొప్పున ₹23.25 కోట్లు పంపిణీ చేశాం. 321 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జిల్లాలో 2,68,050 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. ప్రతి నెలా జిల్లాలోని 685 ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కింద 78 టన్నులు, 120 వసతి గృహాలకు 210 టన్నులు, 777 అంగన్‌వాడీలకు 35 టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. 566 చౌక ధరల దుకాణాల ద్వారా 2,78,400 రేషన్ కార్డులకు 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 345 అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. అన్ని వర్గాల విద్యార్థులకు సక్రమంగా ఉపకార వేతనాలు అందిస్తున్నాం. మున్సిపాలిటీల పరిధిలోని పాఠశాలలకు చెందిన 10,479 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు అందించాం. గురుకుల విద్యార్థులకు కూడా అందిస్తున్నాం. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 22.61 లక్షల పని రోజులు కల్పించి 85,593 మంది కూలీలకు ₹49.75 కోట్ల వేతనం చెల్లించాం. మెటీరియల్ కంపోనెంట్ కింద ₹2.14 కోట్లు చెల్లించాం. గత ఆర్థిక సంవత్సరంలో 12,010 స్వయం సహాయక సంఘాలకు ₹770.20 కోట్ల రుణాలను మంజూరు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1,930 సంఘాలకు ₹198.99 కోట్ల బ్యాంకు రుణాలు ఇప్పించాం. ఇందిరా మహిళా శక్తి కింద 7,772 మహిళలను కొత్తగా మైక్రో ఎంటర్ ప్రైజెస్‌లుగా గుర్తించాం. 78,218 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టించి ₹58.66 లక్షల ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకున్నాం. చేయూత పింఛన్ల ద్వారా 1,38,803 మందికి ప్రతి నెలా ₹32.62 కోట్లు అందిస్తున్నాం. వన మహోత్సవం కింద 313 పంచాయతీల్లో 17.80 లక్షల మొక్కల పెంపకం మొదలు పెట్టి 8,62,088 మొక్కలు నాటాం. ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున 5,65,584 మొక్కలు పంపిణీ చేశాం. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఆయిల్ పాం విస్తరణకు కృషి చేస్తున్నాం. పశు సంవర్ధక శాఖ ద్వారా సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, గడ్డిని కత్తిరించే యంత్రాలు సరఫరా చేశాం. పాడి పశువులు, గొర్రెల పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నాం. మత్స్యశాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ₹1.94 కోట్లతో 216.22 లక్షల చేప పిల్లలను, ₹80.15 లక్షలతో 33.48 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేశాం. జిల్లాలోని 777 అంగన్‌వాడీ కేంద్రాల్లో 4,715 మంది గర్భిణులకు, 4,087 మంది బాలింతలకు ఒక పూట సంపూర్ణ భోజనం, పాలు, గుడ్లు అందిస్తున్నాం. చేనేత కార్మికులకు రసాయనాల కొనుగోలు కోసం 40శాతం రాయితీ ఇస్తున్నాం. నేతన్నకు చేయూత పథకం కింద ₹4.42 కోట్లు చేనేత సహకార సంఘాల్లో జమ చేశాం. ఏదైనా కారణంతో కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందిస్తున్నాం. ఈ పథకంలో 2,326 మందిని చేర్చించాం. పంచాయతీ శాఖ ద్వారా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నాం. పరిశ్రమల శాఖ ద్వారా జిల్లాలో 2,237 సూక్ష్మ, చిన్న తరహా, 16,138 మధ్య తరహా పరిశ్రమలను ₹1,576.3 కోట్లతో ఏర్పాటు చేశాం. టీఎస్ ఐపాస్ ద్వారా రూ.17.63 కోట్ల పెట్టుబడితో స్థాపించే 47 పరిశ్రలకు అవసరమైన అనుమతులు జారీ చేశాం. టీ ఐడియా పథకం కింద 39 పరిశ్రమలకు పావలా వడ్డీ, విద్యుత్ రాయితీ కింద ₹86.45 కోట్లు ఇచ్చాం. నీటి పారుదల శాఖ ద్వారా ఎల్ఎండీ జలాశయం నుంచి యాసంగి సాగుకు 58.082 టీఎంసీల నీటిని వినియోగించుకున్నాం. జిల్లాలోని 11 మండలాల్లో 1,31,352 ఎకరాలకు సాగు నీరిచ్చాం. జిల్లాలోని 494 ఆవాసాలకు తాగునీరు అందించేందుకు ₹1,492 కోట్లతో పనులు చేసి స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తున్నాం.' అని స్పష్టం చేశారు. అంతకు ముందు మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. పోలీసులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ వేడుకల్లో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి, అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ కుమార్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు.

మూడో విడుతలో ₹152.65 కోట్ల రుణమాఫీ!

- 12,034 మంది రైతులకు ప్రయోజనం
- ఇంకా లిస్ట్ విడుదల చేయని ప్రభుత్వం

కరీంనగర్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : మూడో విడుత రైతు రుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కరీంనగర్ జిల్లాలో ఈ విడుత కింద 12,034 మంది రైతులకు ₹152.65 కోట్లు మాఫీ అవుతున్నట్టు డీఏవో బీ శ్రీనివాస్ తెలిపారు. అయితే రైతుల జాబితాను మాత్రం ప్రభుత్వం గురువారం రాత్రి వరకు విడుదల చేయలేదు. శుక్రవారం విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మూడో విడతగా వచ్చిన తుది జాబితా ₹2 లక్షల వరకు రుణం తీసుకున్న వారికి వర్తిస్తుంది. అయితే ఇప్పటికే రెండు విడతల్లో ప్రభుత్వం రుణమాఫీ చేసింది. మొదటి విడుతలో ₹లక్ష వరకు రుణం ఉన్న 38,894 మంది రైతులకు సంబంధించిన ₹201.46 కోట్లు, రెండో విడుతలో ₹1.50 లక్షల వరకు ఉన్న 19,420 మంది రైతులకు సంబంధించిన ₹182.44 కోట్లు ఇది వరకే మాఫీ చేసింది. తాజాగా ₹2 లక్షల వరకు చేసిన మాఫీతో జిల్లాలో 70,348 మంది రైతులకు ₹536.55కోట్లు మాఫీ జరిగింది. అయితే మొదటి రెండో విడుతలో అర్హులైన వందల మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ వర్తించక ఇటు వ్యవసాయ అధికారులు, అటు బ్యాంకుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. అర్హత ఉండి రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించాలని ప్రభుత్వం రైతు వేదికలు, జిల్లా వ్యవసాయ కార్యాలయంలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో వందలాది మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. అయితే ₹2 లక్షల వరకు రుణమాఫీ జరిగిన తర్వాత ప్రభుత్వం తమను పట్టించుకుంటుందా..? లేదా..? అని రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు నమ్మకం లేకుండా పోతున్నదని, రేషన్ కార్డు ప్రాతిపదిన కుటుంబ సభ్యులను గుర్తించడమే అందుకు కారణమని చెబుతున్నారు. రేషన్ కార్డు లేని రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేస్తామని ప్రభుత్వం చెప్పినా, అందుకు సంబంధించిన వారి జాబితాను సేకరించినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ నేతలకు 77వ స్వాతంత్ర్యమేనట!

పరేడ్ గ్రౌండ్ సమీపంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులకు ఫ్లెక్సీ

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 15 : దేశమంతా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటుంటే కరీంనగర్‌లోని కాంగ్రెస్ నేతలు మాత్రం 77వ స్వాతంత్ర్య దినోత్సవం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నగరంలో చర్చకు దారి తీశాయి. నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో అధికారికంగా నిర్వహించే వేడులకు మంత్రికి స్వాగతం పలుకుతూ సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయిలే అందులో మాత్రం 77వ స్వాతంత్ర్య దినోత్సవమని రాయించారు. దీంతో నగరవాసులు అసలు కాంగ్రెస్ నేతలకు ఎన్నో దినోత్సవం కూడా తెలియకుండా పోయిందని ముక్కున వేళ్లు వేసుకుంటున్నారు. ఇటు ఇప్పటికే సోషల్ మీడియాల్లోనూ ట్రోల్స్ మొదలుపెట్టారు. ఎన్నో స్వాతంత్ర్య వేడుక అని తెలుసుకోకుండానే మంత్రులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేస్తారని చర్చించుకుంటున్నారు.